ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జయశంకర్ భూపాలపల్లి

5

ములుగు

ఆదివారం 25 ఆగస్టు 2024



ఇప్పుడంతా ఉరుకుల పరుగుల జీవితం. ఉదయం నిద్ర లేచింది మొదలు.. రాత్రి మళ్లీ నిద్రపోయే వరకు అంతా బిజీబిజీ. ఇక నగర వాసుల గురించైతే చెప్పే పనేలేదు. ప్రతీ క్షణమూ విలువైనదే అన్నట్టుగా వారి దైనందిన జీవితం సాగుతుంది. అలాంటి నగర వాసులు నిత్యం ఎదుర్కొనేది ప్రయాణ ప్రయాస.. ట్రాఫిక్ ఇబ్బందులు. ఈ క్రమంలోనే నగర వాసులకు ముఖ్యంగా అన్ని వర్గాల ఉద్యోగులకు సాంకేతికత బాసటగా నిలుస్తోంది. కొన్ని వాహనరైడ్ యాప్‌లు అందుబాటులోకి రాగా.. ఆ యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకుని రైడ్ బుక్ చేసుకుంటే చాలు నిమిషాల వ్యవధిలో ఉన్నచోటుకు వచ్చి తక్కువ చార్జీకే గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. దీంతో సొంత వాహనాలున్న వారు కూడా ఈ రైడ్స్ పట్ల ఆసక్తి చూపుతుండటం గమనార్హం. ప్రస్తుతం వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రైసిటీల్లో మూడు ప్రముఖ సంస్థలు యాప్‌ల ద్వారా సేవలందిస్తున్నాయి. ఈ అవకాశాన్ని వినియోగించుకుంటున్న వారు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తక్కువచార్జీకే ఉన్నచోటు నుంచి గమ్యస్థానాలకు సకాలంలో చేరుకోవడంతో పాటు ట్రాఫిక్ కష్టాల నుంచి ఉపశమనం పొందుతున్నామంటున్నారు.

- రాంనగర్

భలే చౌక.. జర్నీ

తక్కువ చార్జీకే గమ్యస్థానాలకు..

- అందుబాటులో పలు యాప్‌లు
- వినియోగించుకుంటున్న నగరవాసులు

Sunday SPECIAL



ఈ జర్నీ చాలా సౌకర్యవంతంగా ఉంది

- చిర్ర వెంకటేశ్వర్లు, ప్రభుత్వ టీచర్

"ఉరుకులు పరుగుల జీవితంలో ఈ యాప్‌లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. నేను దుగ్గొండిలో పని చేస్తా. సొంత వాహనం వాడనప్పుడు ఈ సర్వీసులపై ఆధారపడతా. ఆర్టీసీ బస్సులో వెళ్లాలంటే వరంగల్ బస్టేషన్‌కు వెళ్లాలి. నేను పెగడపల్లి డబ్బాల జంక్షన్ వద్ద ఉంటాను. స్కూల్‌కు ఆలస్యం అవుతుందనుకుంటే ఇంటి వద్ద నుంచి ర్యాపిడో సర్వీసులో టూ వీలర్ బుక్ చేసుకుని వెళతాను. రూ.70చార్జీతో సేఫ్‌గా వరంగల్ బస్‌స్టేషన్ చేరుకుంటా. ప్రైవేటు ఆటోలో వెళ్లాలంటే మా ఇంటి నుంచి అర కిలోమీటర్ నడిచి వెళ్లాలి. ర్యాపిడో అయితే బుక్ చేసిన క్షణాల్లో ఇంటి వద్దకు వచ్చి చేరుకుంటుంది. ఈ అవకాశాన్ని నగరంలోని చాలా మంది సద్వినియోగం చేసుకుంటున్నారు."

వివరాలు : 7లో..

ఆశల పల్లకీలో..

- రేషన్ కార్డుల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న కుటుంబాలు
- కొత్త కార్డుల జారీకి ప్రభుత్వం సుముఖత
- మంత్రులతో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు
- మార్గదర్శకాలను సిద్ధం చేస్తున్నట్టు ప్రకటన
- జిల్లాలో ఇప్పటికే 11వేలకు పైగా దరఖాస్తులు





ములుగు, ఆగస్టు 24: తెల్ల రేషన్‌కార్డు.. ప్రజా పంపిణీ వ్యవస్థలో నిరుపేద కుటుంబాలకు ఆహార భద్రత కల్పించే పథకం.. దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాలకు గుర్తింపు పత్రం. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత పొందేందుకు తప్పనిసరిగా భావిస్తున్న కార్డు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత దరఖాస్తుల స్వీకరణే తప్ప కార్డుల జారీని పట్టించుకోకపోవడంతో గత పాలకులపై ప్రజా నిరసన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం నూతన కార్డులిచ్చేందుకు ముందుకు వచ్చింది. దీంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ములుగు జిల్లాకు చెందిన వేలాది కుటుంబాలు రేషన్ కార్డు కోసం ఆశగా ఎదురుచూస్తున్నాయి.

జిల్లాలో 222 రేషన్ దుకాణాలు

ములుగు జిల్లాలో 222 రేషన్ దుకాణాలు, 91,486 కార్డులు ఉన్నాయి. వీటిలో అంత్యోదయ కార్డులు 8,140, ఆహార భద్రత కార్డులు 73,345, ఒక అన్నపూర్ణ కార్డులున్నాయి. మొత్తంగా 2,53,269 మందికి ప్రతీ నెల బియ్యం పంపిణీ చేస్తున్నారు. రూపాయికే కిలో బియ్యం పంపిణీ చేస్తుండగా కరోనా సృష్టించిన ఉపద్రవం నుంచి నిరుపేదలకు ఊరట కల్పించేందుకోసం గత మూడేళ్లుగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో 13లక్షల 54వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఉచితంగా అందజేస్తున్నారు.

11వేల కుటుంబాల ఎదురుచూపు

ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన దరఖాస్తులు ఆహ్వానించింది. ఆరు పథకాల కోసం జిల్లా ప్రజలు లక్షలాదిగా అర్జీలు పెట్టుకున్నారు. వీటిలో 11వేలకు పైగా కుటుంబాలు ఆహార భద్రత కార్డు కావాలంటూ కోరారు. వీటిని ఆన్‌లైన్ చేయగా సివిల్ సప్లై అధికారులు పరిశీలిస్తున్నారు. గడిచిన పదేళ్లలో కొత్త కార్డులేవీ జారీ కాలేదు. వివాహం తర్వాత కొడుకులు తల్లిదండ్రుల నుంచి వేరుపడి కుటుంబాలుగా ఏర్పడ్డారు. సంతానం కలిగిన తర్వాత సభ్యుల సంఖ్య పెరిగింది. కొత్త కార్డులు అటుంచితే గతంలో కార్డుండీ పుట్టిన పిల్లలను కార్డు పరిధిలో చేర్పించుకునేందుకు ఎడిట్ ఆప్షన్ కూడా కల్పించకపోవడంతో ఏళ్ల కాలంగా వేల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. ఇదే సమయంలో ఆయా పథకాలకు రేషన్ కార్డే ప్రామాణికంగా మారడంతో సతమతమవుతున్నారు.

విధివిధానాల రూపకల్పనలో కేబినెట్ సబ్ కమిటీ

రేషన్ కార్డుల జారీ కోసం రాష్ట్ర ప్రభుత్వం మంత్రులు, ఉన్నతస్థాయి అధికారులతో కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. లబ్ధిదారుల ఎంపిక నిబంధనలు, విధివిధానాల రూపకల్పనలో ఈ కమిటీ కసరత్తు చేస్తోంది. దరఖాస్తుదారు కుటుంబ ఆదాయం ఏడాదికి రూ.2.50 లక్షలుగా సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. గత ప్రభుత్వంలో థర్డ్ పార్టీ ఎంక్వైరీ జరిపించింది. అతితక్కువ జీతంతో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు, వాహనాలు, స్థిరాస్తులున్నాయనే కారణాలు చూపుతూ అనేక కుటుంబాలకు కార్డులను తొలగించారు. దీంతో వారు తీవ్ర వేదనకు గురయ్యారు. వీరికి మినహాయింపు ఇచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది.



పంపిణీకి సిద్ధం చేసిన బియ్యం నిల్వలు

ఆదేశాలు ఇంకా అందలేదు

- బానోతు రాంపతి, జిల్లా సివిల్ సప్లై అధికారి

కొత్త రేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం నుంచి ఆదేశాలింకా జారీ కాలేదు. గైడ్‌లైన్స్ వచ్చిన వెంటనే కార్యాచరణ మొదలవుతుంది. ప్రజాపాలన దరఖాస్తులలో రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులు జిల్లా కలెక్టర్ పరిశీలనలో ఉన్నాయి.

రద్దీ ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే



జిల్లా కేంద్రంలోని రద్దీ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే

కృష్ణకాలనీ(భూపాలపల్లి), ఆగస్టు 24: జన సంచారం, రద్దీ ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే సూచించారు. శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లు అయిన జిల్లా పరిషత్ పాఠశాల, బస్టాండ్, మెడికల్ కళాశాల, తదితర ప్రాంతాలను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాలతో నేరాల అదుపుతో పాటు నేరస్థులకు గుర్తించేందుకు ఎంతో దోహదపడుతాయని అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ ద్వారా 24 గంటలు సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ కొనుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు తమ ఇళ్లు, ఆఫీసు, ముఖ్య కార్యాలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ కిరణ్‌ఖరే సూచించారు. ఆయన వెంట భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్, ఎస్సై సుధాకర్ ఉన్నారు.

భూపాలపల్లి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాజేంద్రప్రసాద్



- ఎంజీఎం సూపరింటెండెంట్‌గా డాక్టర్ స్వర్ణకుమారి
- కేఎంసీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ మురళీకృష్ణ

వివరాలు 7వ పేజీలో...

గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తిచేయాలి

- కలెక్టర్ రాహుల్‌శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 24: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జిల్లా పర్యటనకు వస్తున్నందున ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. శనివారం భూపాలపల్లిలోని కలెక్టరేట్‌లో ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి ఈనెల 27న గవర్నర్ పర్యటనపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణపురం మండలకేంద్రంలోని కోటగుళ్ల గణపేశ్వరాలయానికి గవర్నర్ వస్తున్నారని తెలిపారు. పర్యటకు చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆలయ పరిసరాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయ దారిలో గుంతలు లేకుండా మరమ్మతులు చేయాలన్నారు. విధులు కేటాయించిన సిబ్బందికి పాసులు జారీ చేస్తామన్నారు. సమావేశంలో డీపీవో నారాయణరావు, జడ్పీ సీఈవో విజయలక్ష్మి, సీపీవో శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు వైద్యులు నిబంధనలు పాటించాలి

ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖ, ప్రైవేటు వైద్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యులు వసూలు చేసే ఫీజులు, టెస్టుల వివరాలు ఏర్పాటు చేయాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టవ్యతిరేకమని, పరీక్షలు చేయవద్దని అన్నారు. రోగుల కేస్ షీట్ వివరాలు, ప్రసూతి, చిన్నారుల వైద్యసేవల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. డెంగీ, మలేరియా, టీబీ వ్యాధిగ్రస్తుల రికార్డులను నమోదు చేసి ప్రభుత్వానికి అందించాలన్నారు. సీజనల్ వ్యాధులపై వైద్యులు సేవా దృక్పథంతో పనిచేయాలన్నారు. తప్పుడు డెంగీ కేసులతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయొద్దన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక అధికారులు ప్రైవేటు ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ చేస్తారన్నారు. నిబంధనలు పాటించకుండా ఉన్న ఆస్పత్రులను సీజ్ చేస్తారని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో మధుసూదన్, ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

లక్నవరంలో ఏర్పాట్లు చేయాలి

- ఐలాండ్ సుందరీకరణ చేపట్టాలి
- కలెక్టర్ టీఎస్ దివాకర



సరస్సులో బోటింగ్ చేస్తున్న కలెక్టర్ దివాకర, అధికారులు

గోవిందరావుపేట, ఆగస్టు 24: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈనెల 27న మండలంలోని లక్నవరం సరస్సు ప్రాంతంలో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు త్వరితగతిన, పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ టీఎస్ దివాకర సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన జిల్లా అధికారులతో కలిసి లక్నవరం సరస్సు ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సరస్సులోని ఐలాండ్స్, తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఐలాండ్ సుందరీకరణ చేపట్టాలని, గదులను శుభ్రం చేయాలని అధికారులకు సూచించారు. గవర్నర్ పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా కట్టుదిట్టంగా పనులు చేయాలని అన్నారు. అనంతరం సరస్సులో అధికారులతో కలిసి బోటింగ్ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, సీహెచ్.మహేందర్‌జీ, జిల్లా అటవీశాఖ అధికారి రాహుల్ కిషన్‌జాదవ్, పంచాయతీరాజ్ ఈఈ అజయ్‌కుమార్, విద్యుత్ శాఖ డీఈ నాగేశ్వర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

పథకాల అమలులో వేగం పెంచాలి

- రుణమాఫీ పూర్తి చేయకపోతే మూల్యం తప్పదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
- ముగిసిన సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

బాలసముద్రం(హనుమకొండ), ఆగస్టు 24: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలతోపాటు ఇతర సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచాలని, అలాగే హామీలను కూడా వెంటనే నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. మూడు రోజులుగా హనుమకొండలోని హరిత హోటల్‌లో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు శనివారం ముగిశాయి. ఈ ముగింపు సమావేశాల్లో సీపీఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ నారాయణ, అజీజ్ పాషాతో కలిసి మాట్లాడిన ఆయన ప్రభుత్వం ధరణి స్థానంలో ఆర్ఓఆర్ చట్టం ముసాయిదాపై లోతుగా చర్చించి అందరి అభిప్రాయాలు తీసుకుని తీసుకురావాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా ఉన్నమాట వాస్తవమే అయినా, హామీల అమలులో ఇలానే వ్యవహరిస్తే ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తుందని హెచ్చరించారు. రైతు భరోసా, పంటల బీమా పథకం, కొత్త రేషన్ కార్డులు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు, పింఛన్ల పెంపు అమలుకు తక్షణం పూనుకోవాలన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు హామీ సక్రమంగా కొనసాగుతున్నదని హర్షం వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ బకాయిలు ఉన్న నేపథ్యంలో ఆశించిన స్థాయిలో అమలు కావడం లేదన్నారు. రేషన్ కార్డులు లేకపోవడంతో పలు సాంకేతిక కారణాల వల్ల 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, రూ.500లకు గ్యాస్ సిలిండర్ హామీలు పేదలందరికీ వర్తించడం లేదన్నారు. సాంకేతిక కారణాల వల్ల రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని, తక్షణం ప్రభుత్వం రూ.2లక్షల్లోపు రుణమాఫీ పూర్తి చేయకపోతే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని సాంబశివరావు హెచ్చరించారు. ఇటీవలి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పాలక, ప్రతిపక్షాల ఆరోపణలతో ఎక్కువ సమయం వృథా అయిందని, ప్రజల సమస్యలపై అంతంత మాత్రంగానే చర్చ జరిగిందన్నారు. అర్థవంతమైన చర్చలకు, శాసనసభ వేదికగా ఉండాలని, అప్పుడే ప్రజల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ప్రభుత్వానికి సూచించారు.

ఘనంగా ముగిసిన కౌన్సిల్ సమావేశాలు

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు శనివారం ముగిశాయి. 22వ తేదీన ప్రారంభమైన ఈ నిర్మాణ సమావేశాలకు రాష్ట్ర సమితి సభ్యులు, ఆహ్వానితులు మొత్తం 124 మంది హాజరయ్యారు. రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రవేశపెట్టిన నివేదికపై, పార్టీ నిర్మాణంపై విస్తృతంగా జరిగిన చర్చలో వివిధ జిల్లాలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు. రాజకీయ, సామాజిక అంశాలపై సభ్యులు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. భవిష్యత్ రాజకీయ కార్యాచరణను నిర్ణయించారు. మొదటి రోజు పార్టీ పతాకాన్ని జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఆవిష్కరించి సమావేశాలను ప్రారంభించారు. సీపీఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్‌పాషా, చాడా వెంకట్‌రెడ్డి, పశ్య పద్మ, పల్లా వెంకట్‌రెడ్డి రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పరిణామాలు, పార్టీ నిర్మాణం, విస్తరణ, పటిష్ఠం చేయడం తదితర అంశాలపై తమ సందేశాలిచ్చారు. సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి భిక్షపతి, అధ్యక్షతన జరిగిన సమావేశాలలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, కలవేణ శంకర్, వీ.ఎస్.బోస్, బాలమల్లేష్, నరసింహ పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో అనర్థాలపై అవగాహన కల్పించాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, ఆగస్టు 24 : విద్యార్థుల ప్రవర్తనపై కళాశాలల యాజమాన్యాల నిరంతర పర్యవేక్షణ ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. శనివారం హనుమకొండలోని కమిషనరేట్ కార్యాలయంలో నగరంలోని ఇంటర్, డిగ్రీ కళశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కళాశాలల యాజమన్యాలను నమ్మి పిల్లలను తల్లిదండ్రులు పంపిస్తున్నారని, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కళాశాలల్లో విద్యార్థుల భాగస్వామ్యంతో యాంటీ డ్రగ్స్ విభాగాన్ని ఏర్పాటు చేయాలన్నారు. మత్తు పదార్థాల వినియోగం వలన జరిగే నష్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హాస్టల్స్, క్యాంటీన్‌లలో తనిఖీలు నిర్వహించాలన్నారు. కళాశాల పరిసరాల్లో గంజాయి సేవించినట్లు గుర్తిస్తే తమకు సమాచారం అందించాలని కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు షేక్ సలీమా, రవిందర్, ఏసీపీలు జితెందర్, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

హాకీకి పునర్వైభవం వచ్చేనా?

నేడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవం

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 24 : విశ్వ క్రీడ వేదిక పై భారత దేశ కీర్తి ప్రతిష్టలు ఇనుమడించేలా ప్రపంచానికి కనిపించే విధంగా ఒలంపిక్స్ పురుషుల హాకీ జట్టుకు ప్రాతినిథ్యం వహించి ఏకాంగా హ్యాట్రిక్ పసిడి పతకాలను అందించిన హాకీ దిగ్గజం మాణికట్టు మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్. తన క్రీడా ప్రతిభతో మైదానంలో రాకెట్‌లా దూసుకుపోతూ ప్రత్యర్థులను చిత్తు చేస్తూ గోల్స్ చేసేవాడు. దేశవాలి క్రీడగా ప్రాచుర్యం పొందిన హాకీ క్రీడలో 1936సంవత్సరం మాస్కో విశ్వ క్రీడల్లో ధ్యాన్‌చంద్ సారథ్యంలో మన జట్టు చివరి పసిడి అందుకున్నాక భారత హాకీ ప్రమాణాలు పూర్తిగా దిగజారాయి. అంతర్జాతీయ స్థాయి పోటీలో ధ్యాన్ చంద్ స్ఫూర్తితో భారత్‌కు మరో ఐదు స్వర్ణాలు, ఒక రజతం రెండు కాంస్య పతకాలతో సరిపెట్టుకొని అ తరువాత ఏలాంటి పతకాలు సాధించకుండా నాలుగు దశాబ్దాలుగా వేచి చూడాల్సి వచ్చింది. 2021లో టోక్యోలో నిర్వహించిన ఒలంపిక్స్ హాకీ క్రీడలో భారత దేశ జట్టు తరుపున మన్‌ప్రీత్‌సింగ్ సారథ్యంలో 4దశబ్దాల నిరీక్షణకు తెరతీస్తు చారిత్రాత్మక విజయాన్ని దేశానికి అందించి కాంస్య పతకంతో హాకీ ప్రేమికుల్లో నూతనోత్సాహం నింపాడు. అదే విధంగా ఆగస్టు 2024 పారిస్‌లో జరిగిన ఒలంపిక్స్ హాకీ క్రీడలో తృతీయ స్థానంలో నిలిచి వరుసగా రెండో సారీ కాంస్య పతకం సాధించి దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకవచ్చారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ మరణం తరువాత ఒలంపిక్స్‌లో దేశానికి రెండు కాంస్య పతకాలు అందించిన స్ఫూర్తిని నేటి క్రీడాకారులు తీసుకొని రాణించాల్సిన అవసరం ఉంది. 1905 ఆగస్టు 29న ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన సాధించిన ఘనతకు గుర్తుగా భారత ప్రభుత్వం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ప్రతి ఏట నిర్వహించడం ఆనవాయితిగా వస్తుంది.

ప్రధానంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో హాకీ క్రీడను ప్రోత్సహించే వారు లేక పోవడం, వర్ధమాన క్రీడాకారులకు శిక్షణ అందించే అసోసియేషన్లు పూర్తి స్థాయిలో పర్యావేక్షణ లోపం కారణంగా ఈ క్రీడ పట్ల ఆసక్తి చూపడం లేదని పలువురు సీనియర్ క్రీడాకారులు వాపోతున్నారు. కోచ్‌లు సైతం అందుబాటులో లేకపోవడంతో ఈ క్రీడ అంతరించి పోయే అవకాశాలు ఉన్నాయని క్రీడాభిమానులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హనుమకొండ జేఎన్‌ఎస్‌ఎస్‌లో పలు క్రీడలకు వేదికలు, కోర్టులు ఉన్నప్పటికీ దేశవాళి క్రీడగా ప్రసిద్ధి గాంచిన హాకీ క్రీడకు మైదానం లేకపోవడంతో ఈ క్రీడ పట్ల జిల్లా క్రీడా సమాఖ్య ఎంత నిర్లక్ష్యం చేస్తుందో ఇట్టే అర్థమవుతోంది.

సండే స్పెషల్ SUNDAY SPECIAL



భలే చౌక.. జర్నీ

- తక్కువ చార్జీకే గమ్యస్థానాలకు
- అందుబాటులో పలు యాప్‌లు
- వినియోగించుకుంటున్న నగరవాసులు

రాంనగర్, ఆగస్టు 24: త్రినగరిలో చాలా చౌకగా.. తక్కువ చార్జీకే గమ్యస్థానాలకు చేర్చేందుకు పలు యాప్‌ల ద్వారా వాహనాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ అవకాశాన్ని వరంగల్, హనుమకొండ, కాజీపేట (త్రి నగరి) ప్రజలు వినియోగించుకుంటున్నారు. పలు యాప్‌లు కార్పొరేషన్ పరిధిలో తమ సేవలను అందిస్తుండగా ఆ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని రైడ్ బుక్ చేసుకుంటే చాలు నిలుచున్న స్థానం నుంచి సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకునే సౌకర్యం కలుగుతోంది. ఉరుకుల పరుగుల జీవితంలో ఈ యాప్‌లు ఎంతగానో సౌకర్యవంతంగా ఉన్నాయని నగరవాసులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ మూడు యాప్‌లు నగర పరిధి లోనే అందుబాటులో ఉండగా వినియోగదారుల అభిప్రాయం మేరకు మున్ముందు హైదరాబాద్ వరకు సర్వీసు అందించే అవకాశం ఉన్నట్లు ఆయా సంస్థల ప్రతినిధులు చెబుతున్నారు.

అందుబాటులో యాప్‌లు.. చౌకగా ప్రయాణం..

ప్రస్తుతం నగరంలో ఓలా, ఊబర్, ర్యాపిడో యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. మూడు యాప్‌లు బైక్, ఆటో, కార్ సౌకర్యం కల్పిస్తున్నాయి. యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఇంటి బుక్ చేసుకుంటే క్షణాల్లో ఇంటికి వాహనం వస్తుంది. యాప్‌ల ద్వారా బుక్ చేసుకునే వాహనాలు, ఇతర రెంటెడ్ వాహనాలకు చార్జీల్లో చాలా తేడా ఉంటోంది. చౌకగా కోరుకున్న స్థానానికి చేరుకోవచ్చు. ఏ టైమ్‌లోనైనా యాప్‌ల ద్వారా ప్రయాణం సురక్షితమని, ఒకరి కంటే ఎక్కువ ఉన్నవారు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుంటే బయటికంటే సగం చార్జీలకంటే మించకుండా ప్రయాణం చేసే వీలుందని వినియోగదారులు చెబుతున్నారు. కార్పొరేషన్ పరిధిలో ఉద్యోగాలు చేసేవారు, విద్యార్థులు బైక్‌లను బుక్ చేసుకుని వెళుతున్నారు. ఈ క్రమంలో బైక్ సర్వీసుకు గిరాకీ బాగానే ఉన్నట్టు తెలిసింది. వరంగల్ కోట, వేయిస్తంభాల దేవాలయం, భద్రకాళి ఆలయం, కాజీపేట, వరంగల్ రైల్వే జంక్షన్‌లు, బస్టాండ్లకు ఆటో, బైక్‌ను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఒకరికంటే ఎక్కువ మంది ప్రయాణం చేయాల నుకునేవారు ఆటో లేదంటే కారు సర్వీసును వినియోగిస్తున్నారు. సొంత కార్లు ఉన్నవారు సైతం ఈ యాప్‌లపై ఆధారపడుతుండటం విశేషం. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఉన్ననేపథ్యంలో సొంతవాహనాలున్న వారు కూడా ఇబ్బందుల నుంచి తప్పించుకునేందుకు ఈ యాప్‌ల వైపు మొగ్గుచూపుతున్నట్టు తెలుస్తోంది.

కొన్ని ప్రాంతాలకు వసూలు చేస్తున్న చార్జీలిలా (సుమారుగా)

- **ఓలా సర్వీసు:** కేయూ జంక్షన్ నుంచి కాజీపేట రైల్వే స్టేషన్ వరకు 7.5 కి.మీ దూరానికి బైక్ రూ.58, ఆటో (ముగ్గురు) రూ.114, కార్ (నలుగురు) రూ.230 చార్జీ ఉంటుంది. అదే కేయూ జంక్షన్ నుంచి వరంగల్ రైల్వే స్టేషన్‌కు 8కి.మీ దూరానికి బైక్ రూ.80, ఆటో రూ.140, కారు రూ.300చార్జి వసూలు చేస్తున్నారు.
- **ఊబర్ :** కేయూ జంక్షన్ నుంచి కాజీపేట రైల్వేస్టేషన్‌కు ఆటో రూ.114, కారు రూ.215 చార్జీ ఉంటుంది. కేయూ జంక్షన్ నుంచి వరంగల్ రైల్వే స్టేషన్ వరకు ఆటో రూ.160, కారు రూ.318 చార్జీ.
- **ర్యాపిడో:** కేయూ జంక్షన్ నుంచి కాజీపేట రైల్వే స్టేషన్‌కు బైక్ రూ.77, ఆటో రూ.120, కారురూ.207 చార్జీ తీసుకుంటున్నారు. ఇక కేయూ జంక్షన్ నుంచి వ రంగల్ రైల్వేస్టేషన్ వరకు బైక్ అయితే రూ.100, ఆటో కు రూ.160, కారు రూ.270 చార్జీ.

తక్కువ చార్జీతో గమ్యస్థానం చేరుకోవచ్చు

- గడ్డం కుమారస్వామి, వ్యాపారి



ఈ యాప్‌లు సద్వినియోగం చేసుకోవడం ద్వారా తక్కువ చార్జీతో గమ్యస్థానం చేరుకోవచ్చు. సొంత వాహనాలు ఉన్నా నగరంలోని ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ యాప్‌లను వినియోగించుకుంటున్నా. మేం ఉంటున్న విద్యారణ్యపురి నుంచి భద్రకాళి, వేయిస్తంభాల ఆలయంతో పాటు నగరంలోని ఇతర ప్రాంతాలకు కుటుంబసభ్యులతో వెళ్లాలనుకుంటే కారు లేదా ఆటో బుక్ చేసుకుంటాం. ముగ్గురం రూ.120చార్జీ మించకుండా ఆలయానికి వెళతాం. వరంగల్ రైల్వేస్టేషన్‌కు వెళ్లాలనుకున్నా రూ.200 మించదు. ప్రైవేటు వాహనాల్లో వెళ్లాలనుకుంటే రూ.300కంటే ఎక్కువవుతుంది. ఈ యాప్‌లు అందుబాటులోకి రావడంతో డబ్బులు ఆదా, ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎస్ఆర్ విద్యాసంస్థల డైరెక్టర్ సంతోష్‌రెడ్డి తదితరులు

వేడుకగా 'ఎస్ఆర్' డైరెక్టర్ కూతురి వివాహ రిసెప్షన్

మడికొండ, ఆగస్టు 24: ఎస్ఆర్ విద్యా సంస్థల డైరెక్టర్ సంతోష్‌రెడ్డి ప్రథమ కుమార్తె సంజన-గౌతమ్‌ల రిసెప్షన్ వేడుక మడికొండలోని రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాజకీయ, వ్యాపార వర్గాలకు చెందిన ప్రముఖులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ వరదారెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎంజీఎం సూపరింటెండెంట్‌గా డాక్టర్ స్వర్ణకుమారి

- కేఎంసీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ మురళీకృష్ణ
- భూపాలపల్లి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాజేంద్రప్రసాద్

వరంగల్ మెడికల్, ఆగస్టు 24 : ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ పి.స్వర్ణకు మారి నియమితులయ్యారు. కేఎంసీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ వి. మురళీకృష్ణను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జీవో ఆర్టీ నెంబర్ 417ను విడుదల చేశారు. డాక్టర్ జి.స్వర్ణకుమారి 2005 వరకు ఎంజీఎం ఆస్పత్రిలో డెర్మటాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించారు.

అనంతరం ఉస్మానియా ఆస్పత్రికి అసోసియేట్ ప్రొఫెసర్‌గా బదిలీ అయ్యారు. ఇటీవలే ప్రొఫెసర్‌గా పదోన్నతి పొంది తిరిగి ఎంజీఎంలోనే ప్రస్తు తం పని చేస్తున్నారు. ప్రస్తుతం సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. కాగా, డాక్టర్ జి.స్వర్ణకుమారి ఈ విధుల్లో చేరేందుకు కుటుంబ సమస్యల కారణంగా నిరాకరిస్తున్నట్లు తెలుస్తోంది. కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులైన డాక్టర్ వి.మురళీకృష్ణ ఇటీవలే ఎంజీఎం ఆస్పత్రికి పిల్లల విభాగం ప్రొఫెసర్‌గా విభాగం అధిపతిగా బదిలీపై వచ్చారు. నీలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పని చేసిన అనుభవం కూడా ఉంది.

భూపాలపల్లి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ పి. రాజేంద్ర ప్రసాద్ నియమితులయ్యారు. ఎంజీఎం ఆస్పత్రి జనరల్ మెడిసిన్ విభాగంలో సుదీర్ఘకాలం పాటు ప్రొఫెసర్‌గా పనిచేశారు. వరంగల్ సీకేఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా కూడా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం భూపాలపల్లి మెడికల్ కళాశాలలో రాజేంద్రప్రసాద్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడు.

అలాగే హనుమకొండలోని ప్రభుత్వ టీబీ, చాతి వ్యాధుల ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ సి.సంజీవ్ కుమారి నియమితులయ్యారు. ఎంజీఎం ఆస్పత్రి రేడియో థెరపి ప్రొఫెసర్‌గా ప్రస్తుతం పని చేస్తున్నారు.

హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాజేశ్వరి, వరంగల్ సీకేఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ జి.షర్మిల, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాజాభరత్ కుమార్‌లను ప్రభుత్వం నియమించింది.

డెంగీతో బీటెక్ విద్యార్థి మృతి

- నాలుగు రోజుల్లో డెంగీతో ఇద్దరు మృతి
- భయాందోళనలో తొర్రూరు పట్టణప్రజలు



ప్రేమ్‌కుమార్ (ఫైల్)

తొర్రూరు, ఆగస్టు 24 : డెంగీ జ్వరంతో ఓ బీటెక్ విద్యార్థి మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో శనివారం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి కుటుంబసభ్యుల కథనం ప్రకారం. నర్సింహులపేట మండల కేంద్రానికి చెందిన బేతమల్ల రమేష్-లక్ష్మీకాంత దంపతులు గత 20 ఏళ్లుగా తొర్రూరు పట్టణంలో నివాసం ఉంటున్నారు. వారికి కుమారుడు ప్రేమ్‌కుమార్, కుమార్తె ప్రియాంక సంతానం. రమేష్ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కుమారుడు బేతమల్ల ప్రేమ్‌కుమార్ (23) బీటెక్ ఫైనల్ ఇయర్ వరంగల్‌లోని వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతూ, ఇటీవల కోచింగ్ కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. ఈనెల 19వ తేదీన రాఖీ పండుగకు తన చెల్లెలుతో రాఖీ కట్టించుకునేందుకు తొర్రూరుకు రాగా, జ్వరం వచ్చింది. 22వ తేదీన తొర్రూరులోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా రక్తకణాల సంఖ్య తక్కువగా ఉందని అడ్మిట్ కావాలనడంతో.. 23న పట్టణంలోని మరో ఆస్పత్రికి చికిత్స కోసం వెళ్లారు. ప్రేమ్‌కుమార్‌కు డాక్టర్లు పరీక్షలు నిర్వహించి, పరిస్థితి విషమంగా ఉందని.. పెద్ద ఆస్పత్రికి వెళ్లాలని సూచించడంతో ఖమ్మంలోని సురక్ష దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున 4 గంటలకు మృతి చెందాడు. కాగా, మృతుడి సోదరి ప్రియాంక బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. చేతికందిన కొడుకు మృతి చెందడంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు. కొద్ది రోజుల్లో కుమారుడు చేదోడు వాదోడుగా నిలుస్తాడని కోటి ఆశలతో ఎదురు చూస్తున్న తల్లిదండ్రులకు తీవ్ర నిరాశ ఎదురైందని ఆవేదన వ్యక్తం చేశారు.

పారిశుధ్య నిర్వహణ లోపం

నాలుగు రోజుల వ్యవధిలో డెంగీ జ్వరంతో ఇద్దరు మృతి చెందడంతో తొర్రూరు ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈనెల 20వ తేదీన పట్టణ కేంద్రానికి చెందిన హత్విక (4) డెంగీతో మృతి చెందిన విషయం తెలిసిందే! పట్టణంలో డంపింగ్ యార్డు లేకపోవడంతో మునిసిపాలిటీ సిబ్బంది చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయడంతో పారిశుధ్య లోపం ఏర్పడి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.

బీఆర్ఎస్‌వి బూటకపు ధర్నాలు

- రుణమాఫీపై వారివి అసత్య ప్రచారాలు
- మీడియాతో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, ఆగస్టు 24 : రుణమాఫీపై బీఆర్ఎస్ నాయకులవి బూటకపు ధర్నాలని తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఆరోపించారు. వాస్తవాలను వక్రీకరిస్తూ రైతులను ఆందోళనకు గురి చేస్తున్న బీఆర్ఎస్ నాయకులకు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. శనివారం హనుమకొండలోని డీసీసీబీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ. 2 లక్షల రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. దేశంలోనే రుణమాఫీ చారిత్రాత్మకమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేని బీఆర్ఎస్ నేతలు తప్పుడు మార్గాలను ఎంచుకుంటున్నారని మండిపడ్డారు.

ఖమ్మంలో సంకెళ్లు వేసిన ఘటనను రైతులు మరువలేదు

రుణమాఫీని వక్రీకరిస్తూ రైతులను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని బీఆర్ఎస్ నేతలు ఆరాటపడుతున్నారని రవీందర్‌రావు దుయ్యబట్టారు. బీఆర్ఎస్ హయంలో ఖమ్మంలో రైతులకు సంకెళ్లు వేసిన ఘటన ఇంకా రైతులు మరచిపోలేదన్నారు. రైతులు బీఆర్ఎస్‌ను అధికారం నుంచి దించివేసినా ఇంకా ఆ పార్టీ నేతలు కళ్లు తెరవలేదన్నారు. రైతుల పొట్ట కొట్టిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు రుణమాఫీపై తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. సహకార సంఘాల ద్వారా దశల వారిగా రుణమాఫీ ప్రకటించిన ప్రభుత్వం 27 రోజుల్లోనే 22 లక్షల మంది రైతులకు మొత్తంగా రూ. 18 కోట్ల రుణమాఫీ నిధులు బ్యాంకుల్లో జమ చేయడం జరిగిందని వివరించారు.

అర్హులందరికీ రుణమాఫీ తప్పక వర్తింపు

బీఆర్ఎస్ నాయకుల అసత్య ప్రచారాలను రైతులు నమ్మవద్దని రవీందర్‌రావు కోరారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ తప్పక జరుగుతుందని చెప్పారు. సాంకేతిక సమస్యలు కొన్ని ఇతర కారణాల వల్ల కొందరు రైతులకు మాఫీ జరగడంలో జాప్యం జరిగిందన్నారు. అయితే ప్రభుత్వం వెను వెంటనే సమస్య పరిష్కార చర్యలు చేపట్టిందన్నారు. ఈ మేరకు ఎవరైతే అర్హులైన రైతులు సమస్యలు ఎదుర్కొన్నారు పరిష్కార చర్యలతో రుణమాఫీ లబ్ధి పొందుతున్నారని వివరించారు. అధికారంలో ఉండగా ఏనాడు రైతుల కష్టాలు పట్టించుకోని బీఆర్ఎస్ నాయకులు ఇకనైనా రాజకీయ స్వార్థాన్ని మరిచి రైతులకు మేలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి సహకరిస్తే మంచిదన్నారు. లేని పక్షంలో రైతుల నుంచి గుణపాఠం తప్పదని బీఆర్ఎస్ నేతలను హెచ్చరించారు. బీఆర్ఎస్ దగాకోరు మాటలను నమ్మవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ రైతుల ప్రభుత్వమని పేర్కొన్నారు.

గ్రామంలోని సమస్యలపై దృష్టి పెట్టాలి

▸▸ జిల్లా పంచాయతీ అధికారి నారాయణరావు

కృష్ణకాలనీ(భూపాలపల్లి), ఆగస్టు 24: గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేకాధికారి నారాయణరావు అన్నారు. శనివారం భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కారానికి పలు సూచనలు చేశారు. వర్షాకాలం దృష్ట్యా దోమలు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీ రోజు తాగునీరు క్రమం తప్పకుండా సరఫరా చేయాలని, వీధిలైట్లను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణను సైతం పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఇతరత్రా ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కోటి, కారోబార్ రాజీరు, గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలోనే వంతెనపై రాకపోకలు ప్రారంభం



వంతెన పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

టేకుమట్ల, ఆగస్టు 24: టేకుమట్ల-రాఘవరెడ్డిపేట గ్రామాల మధ్య గల వంతెన పై నుంచి సెప్టెంబరు మొదటి వారంలో రాకపోకలు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం వంతెన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వం వంతెన నిర్మాణంలో నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రజల సౌకర్యార్థం వేగవంతంగా వంతెన పునఃనిర్మాణ పనులు చేశామన్నారు. పనులు తుది దశకు చేరుకున్నాయని, తొందరలోనే రాకపోకలు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక కేసుల పరిష్కారానికి సహకరించాలి

▸▸ సీనియర్ సివిల్ జడ్జి కన్నయ్యలాల్

ములుగు, ఆగస్టు 24: ములుగులోని జిల్లా కోర్టు ఆవరణలో సెప్టెంబరు 28న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారం అయ్యేందుకు అన్ని శాఖల అధికారులు సహకరించాలని సీనియర్ సివిల్ జడ్జి టి.కన్నయ్యలాల్ అన్నారు. శనివారం కోర్టుఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన అధికారులనుద్దేశించి మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు ఎలాంటి ఇబ్బంది పడకుండా రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకునేందుకు అన్నిశాఖల అధికారులు సహకరించాలని అన్నారు. సమావేశంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.సౌఖ్య, సీఐలు రవీందర్, శ్రీనివాస్, బండారి కుమార్, ఎస్సైలు సతీష్, కమలాకర్, శ్రీకాంత్‌రెడ్డి, షేక్ మస్తాన్, వెంకటేశ్వర్‌రావు, తాజొద్దీన్, సూరి, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

హక్కుల రికార్డు బిల్లుపై అభిప్రాయ సేకరణ

ములుగు, ఆగస్టు 24: నూతన తెలంగాణ హక్కుల రికార్డు బిల్లు-2024పై శనివారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అభిప్రాయ సేకరణ జరిగింది. కలెక్టర్ టీఎస్.దివాకర ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లా కోర్టు న్యాయవాదులు, రైతులు, అధికారులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. భూములకు జియో ట్యాగింగ్, పక్కా మ్యాపింగ్ చేయాలన్నారు. గత చట్టంలో ఉన్న లోపాలను సవరించాలని తెలిపారు. రిజిస్ట్రేషన్, మ్యూటేషన్‌ను వేర్వేరు అధికారుల సమక్షంలో జరిగేలా చూడాలన్నారు. సేకరించిన అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని కలెక్టర్ దివాకర అన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కాళేశ్వర ట్రస్టుబోర్డు చైర్మన్ కోసం ప్రయత్నాలు షురూ..

మహదేవపూర్, ఆగస్టు 24: తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థాన ట్రస్టుబోర్డు చైర్మన్, డైరెక్టర్ల పదవుల కోసం ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలోని 26 దేవాలయాలకు ట్రస్టు బోర్డుల నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీ చేసింది. ఇందులో భాగంగానే కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయానికి ట్రస్టుబోర్డు చైర్మన్, డైరెక్టర్ల నియామకానికి దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ట్రస్టు బోర్డుల నియామకానికి తగు చర్యలు చేపట్టాలని దేవాదాయ శాఖ డైరెక్టర్‌ను శైలజా రామయ్యార్ ఆదేశించారు. ఈక్రమంలో ఆలయ చైర్మన్, డైరెక్టర్ల పదవుల కోసం పలువురు నాయకులు, రాజకీయ ప్రముఖులు, ఈ ప్రాంత నేతలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే పలువురు నేతలు పైరవీలు చేస్తూ మంత్రి శ్రీధర్‌బాబు మెప్పు కోసం తహతహలాడుతున్నారు.

ఆపదలో ఉన్న వారికి కాంగ్రెస్ అండ

▸▸ జాతీయ మిర్చి టాస్క్‌ఫోర్స్ డైరెక్టర్ సాంబశివరెడ్డి

మంగపేట, ఆగస్టు 24: ఆపద సమయంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అండగా ఉండి కార్యకర్తలకు ధైర్యం ఇస్తుందని జాతీయ మిర్చి టాస్క్‌ఫోర్స్ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి అన్నారు. మండలంలోని కొత్త మల్లూరుకు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన బట్ట సతీష్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. రాజుపేట మాజీ సర్పంచ్, బీసీ సంఘాల జిల్లా నాయకుడు చందర్లపాటి శ్రీనివాసారావు సతీష్ సతీమణి నిర్మలను ఓదార్చి రూ.5వేలు, 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. సాంబశివరెడ్డి ఆ కుటుంబాన్ని ఓదార్చి ఆపదలో ఉన్న కుటుంబాలకు మంత్రి సీతక్క సహాయం అందించి ఆదుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు బట్ట రామారావు, గ్రామ అధ్యక్షుడు మాటూరి నర్సింహారావు, నాయకులు బి.సంతోష్, ఎం.ప్రశాంత్, ఎం.పరమేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మహదేవపూర్, ఆగస్టు 24: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మహదేవపూర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ గంట చంద్రశేఖర్ అన్నారు. స్థానికంగా శనివారం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నిల్వ నీరు ద్వారా దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. ఆస్పత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్యం అందించడమే తమ లక్ష్యమన్నారు. ఆస్పత్రి ఉద్యోగులు, సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విష జ్వరాలు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాలు అందించేందుకు శిబిరం

కన్నాయిగూడెం, ఆగస్టు 24: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆలింకో సంస్థ హైదరాబాద్ వారి సహకారంతో దివ్యాంగులకు ఉపకరణాలు అందించేందుకు అర్హులను గుర్తించేందుకు మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఏటూరునాగారం ప్రాజెక్టు ఐసీడీఎస్ సీడీపీవో ఈపీ ప్రేమలత హాజరై మాట్లాడారు. దివ్యాంగులు విభిన్న ప్రతిభా పాటవాలు కలిగి ఉన్న నైపుణ్యవంతులను, వారికి సరైన చేయూతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్నారు. వెనకబాటుకు కారణమైన వైకల్యాన్ని జయించి ముందడుగు వేసేలా వారికి అవసరమైన సహాయ ఉపకరణాలు, పరికరాలు అందించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఆలింకో సంస్థ ప్రతినిధి ఆశిష్, సూపర్‌వైజర్ పుష్పవతి, పోషణ్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ ఇమ్మాన్యుయేల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తాంజనేయస్వామి ఆలయంలో ఏకాహం భజన

కాటారం, ఆగస్టు 24: మండలంలోని కాటారం భక్తాంజనేయస్వామి ఆలయంలో శనివారం ఏకాహం భజన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక భజనపరులు, భక్తులు, గ్రామస్తులు ఆలయంలో 24గంటల పాటు ఏకబిగిన తబలా, తాళం, హార్మోనియం ఆపకుండా భజన చేయడమే ఏకాహం అని అర్చకుడు నిఖిల్ తెలిపారు. కళాకారులు వివిధ రకాల భక్తిపాటలతో శ్రోతలను అలరించారు. అంతకుముందు ఆలయంలో భక్తులు, హనుమాన్ దీక్షాపరులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

జడ్పీహెచ్ఎస్‌లో తిథి భోజనం ప్రారంభం



పాఠశాలలో తిథి భోజనం వడ్డిస్తున్న దాతలు

మంగపేట, ఆగస్టు 24: మండలంలోని కమలాపురం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తిథి భోజన కార్యక్రమం శనివారం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు గ్రామంలో ఏదైనా శుభ కార్యక్రమాలు జరిగితే వారు నేరుగా పాఠశాలకు వచ్చి తిథి భోజనాలను పెట్టొచ్చునని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు జ్వాలా ట్రస్ట్ ఆధ్వర్యంలో కమలాపురంకు చెందిన యలవర్తి శ్రీనివాసరావు(శంకరన్న) బంధువు యలవర్తి పూర్ణచందర్‌రావు- అశ్వినీ పెళ్లిరోజును పురస్కరించుకొని పాఠశాల ఆవరణలో విద్యార్థులకు తిథి భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం గడ్డి శ్రీనివాస్, ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు చింత లక్ష్మీనారాయణ, జ్వాలా ట్రస్ట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడెల నరేష్, మునిగాల రాకేష్, దాతలు యలమర్తి పూర్ణచందర్‌రావు, యలమర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కనుల పండువగా బాలగోకులం



ములుగులో నృత్యం చేస్తున్న చిన్నారులు



చింతకానిలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణతో చిన్నారులు

బాలకృష్ణుడు, గోపికా వేషధారణలో అలరించిన చిన్నారులు

ములుగు, ఆగస్టు 24: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని శనివారం ములుగులో బాలగోకులం ఉత్సవ సమితి ఆధ్వర్యంలో బాలగోకులం వేడుకను నిర్వహించారు. స్థానిక తంగేడు స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి ములుగు, వెంకటాపూర్(రామప్ప) మండలాలకు చెందిన ఆయా పాఠశాలల చిన్నారులు తరలివచ్చారు. చిన్నికృష్ణుడు, గోపికా వేషధారణలో ఉన్న చిన్నారులు నృత్యాలు చేశారు. జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. సుమారు 500 మంది చిన్నారులు ఈ వేడుకలో పాల్గొనడంతో సందడి నెలకొంది. ఈ సందర్భంగా జిల్లా రవాణాధికారి సిరాజ్ అహ్మద్ మాట్లాడుతూ భారతీయ సనాతన సంస్కృతి గొప్పదని, కులమతాలకు అతీతంగా పాటించడం ఒక్క భారత దేశానికే సాధ్యమని అన్నారు. చిన్నారులకు నిర్వాహకులు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్రీయ సేవికా సమితి ప్రతినిధి వాంకుడోతు జ్యోతి, బాలగోకుల ఉత్సవ సమితి అధ్యక్షుడు గండ్రకోట కుమార్, ధర్మజాగరణ సమితి సభ్యులు రవిరెడ్డి, శ్రీనివాస్, శ్రీతన్, నాగరాజు, మహేష్, జశ్వంత్, సాయిరాం, సాత్విక్, అభినయ్, రాము పాల్గొన్నారు.

- కాటారం: మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తుగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీకృష్ణుడి జన్మదినమైన కృష్ణాష్టమి సోమవారం ఉండటంతో దేవరంపల్లి, చింతకాని జడ్పీహెచ్ఎస్, ఆదర్శ ఉన్నత పాఠశాలతో పాటు పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ముందుగానే వేడుకలు వైభవంగా నిర్వహించారు. పలువురు చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ఉట్టి కొట్టే కార్యక్రమం కనుల పండువగా జరిగింది. ప్రిన్సిపాల్ కార్తీక్‌రావు, హెచ్ఎంలు రాజబాబు, కిషన్, దేవూనాయక్, లక్ష్మణ్‌నాయక్, ఉపాధ్యాయులు శారద, జయరాజ్, రాజారాం, సురేష్, స్వరూప పాల్గొన్నారు.
- మల్హర్: మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులతో గోపిక, కృష్ణుడు వేషధారణలతో అలంకరించారు. ముందస్తు వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు ఆడిపాడారు.
- గణపురం: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రొఫెల్ హైస్కూల్, నారాయణ హైస్కూల్, శ్రీ నేతాజీ హైస్కూల్‌లలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉట్టిని పగలకొట్టి చిన్నారులు సంబరాలు జరుపుకున్నారు.
- వెంకటాపురం(నూగూరు): మండలకేంద్రంలోని విజన్ పబ్లిక్ స్కూల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. రెండురోజుల పాటు పాఠశాలలకు సెలవులు రావడంతో ముందస్తుగా పాఠశాలల్లో విద్యార్థులు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణుడు, రాధ, సత్యభామ, గొల్లభామ వేషధారణతో వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.
- వెంకటాపూర్(రామప్ప): ప్రపంచ సకల జీవుల హితవు కోరేది భగవద్గీతేనని మండల కేంద్రంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ నరెడ్ల భాస్కర్ అన్నారు. ముందస్తుగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం స్థానిక జోహార్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కృష్ణుడి ప్రతిమ వద్ద కనుల పండువగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. చిన్నారులను కృష్ణుడు, గోపికల వేషధారణతో అందంగా అలంకరించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అబ్దుల్ జాహిద్, ఆలయ అర్చకులు ముదుంబ రఘునాథాచార్యులు, వర్తక సంఘం సభ్యులు లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సస్పెండ్ అయిన డీఆర్‌డీఏ పీడీపై విచారణ

మొగుళ్లపల్లి, ఆగస్టు 24: భూపాలపల్లి జిల్లా డీఆర్‌డీఏ పీడీగా పనిచేసి సస్పెండ్ అయిన పురుషోత్తంపై సెర్ప్ విభాగం హైదరాబాద్ డైరెక్టర్లు శనివారం విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా మండల సమాఖ్య కార్యాలయానికి వారు ఉదయాన్నే చేరుకున్నారు. పురుషోత్తం డీఆర్‌డీఏ పీడీగా పనిచేసిన క్రమంలో అనేక అవినీతి, ఆరోపణలు వచ్చాయి. కాగా, భూపాలపల్లి నుంచి మహబూబాబాద్‌కు బదిలీ అయిన రెండు నెలల్లోనే ఉన్నతాధికారులు విచారణ చేపట్టి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మరిన్ని వివరాలను సేకరించేందుకు సెర్ప్ డైరెక్టర్లు మండల సమాఖ్య అధ్యక్షురాలు బండారి మంజుల, కార్యదర్శి శోభ, పిడిసిల్ల వీవోఏ కుమార్‌ల నుంచి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా అకౌంటెంట్, కంప్యూటర్ ఆపరేటర్ల నెలవారీ వేతనాలు పెంచడంపై కూడా విచారణ చేపట్టినట్లు తెలిసింది. కార్యక్రమంలో డీపీఎం సోమయ్య, ఏపీడీ గోవిందు, స్థానిక ఏపీఎం రవివర్మ, సీసీలు, పిడిసిల్ల గ్రామ సంఘం పాలకవర్గం పాల్గొన్నారు.

ప్రైవేటు క్లినిక్‌లో వైద్యాధికారుల తనిఖీలు

▸▸ నిబంధనలు పాటించనందుకు నోటీసులు

ములుగు, ఆగస్టు 24: ములుగు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు క్లినిక్‌లో వైద్యశాఖ అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు జరిపారు. టీబీ, ఎయిడ్స్ నియంత్రణ, లెప్రసీ విభాగం రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎ.రాజేశం, జిల్లా వైద్యాధికారి డాక్టర్ అల్లెం అప్పయ్య బృందం స్థానిక స్టార్ హాస్పిటల్‌లో తనిఖీలు నిర్వహించారు. సిటిజన్ చార్టర్, ధరల పట్టిక, బయో మెడికల్ వేస్ట్ మేనేజిమెంట్, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్లు లేనట్లు గుర్తించి నోటీసులు జారీ చేశారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విపిన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దుర్గారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ సభ్యులు



కలెక్టర్‌తో సమావేశమైన రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

ములుగు, ఆగస్టు 24: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈనెల 27న ములుగు జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా పాలకవర్గ సభ్యులు శనివారం కలెక్టర్ టీఎస్.దివాకరను కలిశారు. పర్యటనకు అవసరమైన ఏర్పాట్ల విషయమై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీ, ఆర్డీవో కె.సత్యపాల్‌రెడ్డి, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ అప్పయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు కొత్తపల్లి ప్రసాదరావు, ఈవీ.శ్రీనివాసరావు, జిల్లా కమిటీ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీనివాస్, కార్యదర్శి చుంచు రమేష్, సభ్యులు కొట్టి రాజిరెడ్డి, బండి ఈశ్వర్, గూడూరు మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

సంత నిర్వహణకు వేలంపాట

మొగుళ్లపల్లి, ఆగస్టు 24: మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం జరిగే కూరగాయల సంత నిర్వహణకు శనివారం గ్రామపంచాయతీ ఆవరణలో వేలంపాట నిర్వహించినట్లు మండల ప్రత్యేకాధికారి సునీత తెలిపారు. వేలంపాటలో సుమారు 17మంది పాల్గొనగా నిమ్మల సారయ్య రూ.35,500 పాట పాడి వేలాన్ని దక్కించుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సారయ్య మాట్లాడుతూ సంతకు వచ్చే వ్యాపారులు, ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, మాజీ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఏఐఏవైఎస్ కమిటీ ఎన్నిక

కాటారం, ఆగస్టు 24: మండలంలోని ఒడిపిలవంచలో శనివారం ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం(ఏఐఏవైఎస్) గ్రామ కమిటీ ఎన్నిక జరిగింది. సంఘం జిల్లా కోఆర్డినేటర్ పొట్ట పోచయ్య సమక్షంలో కమిటీ ఎన్నిక జరగగా సంఘం అధ్యక్షుడిగా వావిళ్ల సుధాకర్, ఉపాధ్యక్షులుగా దండ్రు మధూకర్, కొలుగూరి తిరుపతి, ప్రధాన కార్యదర్శులుగా దండ్రు లక్ష్మీరాజ్, వావిళ్ల రాజేష్, కోశాధికారిగా ఇసునం లక్ష్మీరాజ్, సంయుక్త, సహాయ కార్యదర్శులుగా శేఖర్, శరత్‌లతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో వరుణ్ రాజ్, దేవేందర్, వెంకటేష్, సందీప్, రాజు, ప్రశాంత్, రాధాకృష్ణ, సాయి, కుమార్, గణేష్, శ్రీధర్, శివ, రవి తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు అధ్యాపకుల సన్మానం

ఏటూరునాగారం, ఆగస్టు 24: ఏటూరునాగారంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సీహెచ్.భాస్కర్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రేణుక, అధ్యాపక బృందం శనివారం కళాశాలలో శాలువాలు కప్పి సన్మానించారు. కాగా, భాస్కర్ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఉత్తమ సేవలు అందించినందుకు గాను ప్రభుత్వం ఉత్తమ సేవ అవార్డుకు ఎంపిక చేసింది. దీంతో ఆయన స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. భాస్కర్‌ను అభినందిస్తూ కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సీహెచ్.వెంకటయ్య, ఫాతిమా, జ్యోతి, సంపత్, ముని, రమేష్, అధ్యాపకేతరులు విజయలక్ష్మి, శ్రీనివాస్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన

కాటారం, ఆగస్టు 24: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకులంలో పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం సీజనల్ వ్యాధుల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైద్యశిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం ఉపాధ్యాయులు, విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి మౌనిక అన్నారు. దోమల వ్యాప్తి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ తిరుపతిరెడ్డి, హెచ్ఈవో తిరుపతిరెడ్డి, హెచ్ఏ సమ్మయ్య, ప్రిన్సిపాల్, వార్డెన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సభ్యత్వ నమోదు చేపట్టాలి

వెంకటాపూర్(రామప్ప), ఆగస్టు 24: కాంగ్రెస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండలంలో అత్యధికంగా చేపట్టాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇస్సార్‌ఖాన్ పిలుపునిచ్చారు. శనివారం మండలకేంద్రంలో కట్టికోళ్ల వెంకటేష్ అధ్యక్షతన సమావేశం జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. వివిధ గ్రామాల యువజన నాయకులు ఎక్కువ సభ్యత్వాలు చేసినట్లయితే సన్మానంతోపాటు తగిన గుర్తింపు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడు మారం సుమన్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి, నాయకులు రేవంత్, పవన్, ప్రజ్వల్, శ్యామ్, రాకేష్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి

కాటారం, ఆగస్టు 24: గ్రామాల్లో నిత్యం పారిశుధ్య నిర్వహణ పనులు సక్రమంగా నిర్వహించాలని మండల పంచాయతీ అధికారి వీరస్వామి అన్నారు. మండల కేంద్రమైన కాటారం జీపీతో పాటు ప్రతాపగిరి, చిద్నెపల్లి తదితర గ్రామ పంచాయతీల్లో శనివారం ఎంపీవో పర్యటించి పారిశుధ్య సమస్యలను పరిశీలించారు. కాటారం జీపీలో చేపట్టిన పారిశుధ్య పనులను పరిశీలించి కార్యదర్శి సమీర్‌ఖాన్‌కు పలు సూచనలు చేశారు. డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా మారకుండా తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శంకర్, సిబ్బంది శ్రీనివాస్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

▸▸ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సీతక్క, నాగేశ్వరరావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏటూరునాగారం, ఆగస్టు 24 : ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం రాష్ట్రంలోని రైతులందరికీ రుణమాఫీ చేసిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. శనివారం మండలకేంద్రంలోని బస్టాండ్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు రఘు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆశీస్సులతో ఏర్పడిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారంగా రాష్ట్రంలోని రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. పనికట్టుకొని ప్రతిపక్ష పార్టీలు తమ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. రుణమాఫీ కానీ రైతులు ఆందోళన చెందొద్దని తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, బ్లాక్ యూత్ అధ్యక్షుడు వసంత శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎమ్డీ.ఖలీల్ ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్నఎల్లయ్య, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, యూత్ ప్రధాన కార్యదర్శి ఎమ్డీ.గౌస్‌పాషా, సీనియర్ నాయకులు గంపల శివకుమార్, ఎమ్డీ.అయ్యూబ్ ఖాన్, కె.రంజిత్, ఈసం నర్సయ్య, సరికొప్పుల శ్రీనివాస్, ఎమ్డీ.లాల్, కొప్పుల శ్రీనివాస్, మామిడి రాంబాబు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రైతు రాజ్యం సాధ్యం

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డి

వెంకటాపూర్(రామప్ప), ఆగస్టు 24: కాంగ్రెస్ పార్టీతోనే రైతు రాజ్యం సాధ్యమని, సీఎం రేవంత్‌రెడ్డి ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయడం దేశంలోనే చరిత్రాత్మకంగా నిలుస్తుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ఖజానాపై భారం పడుతున్నప్పటికీ రైతులకు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి రూ.2లక్షల రుణమాఫీ చేశారన్నారు. దీనిని జీర్ణించుకోలేని ప్రతిపక్ష పార్టీలు రాద్ధాంతం చేయడం సరైంది కాదని అన్నారు. అర్హులైన ప్రతి రైతుకు పంట రుణమాఫీ వర్తిస్తుందని, ఇందులో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. రుణమాఫీ అయినా బీఆర్ఎస్ నాయకులు రోడ్లెక్కి ధర్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. వివిధ కారణాలతో మిగిలిపోయిన రైతుల వివరాలు సేకరించాలని ఇప్పటికే ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని అన్నారు. రైతులు బీఆర్ఎస్, బీజేపీ చట్రంలో పడొద్దని కోరారు. సమావేశంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బండి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిల్కూరి ఐలయ్య, నాయకులు పిన్నిరెడ్డి రాజిరెడ్డి, దొంతరవేని కుమార్, మామిడిశెట్టి కోటి, శ్రీనివాస్, వెంకటేష్, బుర్ర సమ్మయ్య, జంగిలి రవి, షకీల్, చెన్నోజు శ్రీనివాస్, కొండ తిరుపతి, కూన దీపక్ పాల్గొన్నారు.

ప్రగతి చక్రం అవార్డుకు డ్రైవర్ వెంకటేశ్వర్లు ఎంపిక



కాకతీయఖని, ఆగస్టు 24: ఆర్టీసీ సంస్థలో పనిచేస్తున్న ఉత్తమ ఉద్యోగులకు ప్రగతి చక్రం పురస్కారాలను శనివారం హైదరాబాద్‌లో ప్రదానం చేశారు. ఈ పురస్కారానికి భూపాలపల్లి డిపోలో పనిచేస్తున్న డోరి వెంకటేశ్వర్లు(టిమ్ డ్రైవర్) ఎంపికయ్యారు. రోజువారి టార్గెట్, డీజిల్ ఆదా చేసినందుకు గాను యాజమాన్యం గుర్తించి ప్రగతి చక్రం అవార్డుకు ఎంపిక చేసింది. వరంగల్ రీజియన్ పరిధిలో 9 డిపోలు ఉండగా సుమారు 1500 మంది డ్రైవర్లు పనిచేస్తున్నారు. వారిలో భూపాలపల్లి డిపో, మహబూబాబాద్ డిపో నుంచి ఇద్దరు డ్రైవర్లు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. వీరికి హైదరాబాద్‌లోని ఆర్టీసీ భవన్‌లో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అవార్డులను అందజేశారు.

కాళేశ్వరంలో కాలసర్ప దోష నివారణ పూజలు



ఆలయంలో కాలసర్ప దోష నివారణ పూజలు చేస్తున్న భక్తులు

మహదేవపూర్, ఆగస్టు 24: మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానంలో శనివారం భక్తులు పెద్ద ఎత్తున కాలసర్ప దోష నివారణ, నవగ్రహ పూజలు చేశారు. శ్రావణ మాసం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉదయం నుంచి గోదావరిలో స్నానాలు ఆచరించి గోదావరి మాతకు పూజలు చేశారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో స్వామి వారికి అభిషేకాలతో పాటు పలు ప్రత్యేక పూజలు గావించారు. అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు చేశారు. సరస్వతిదేవి ఆలయంలో అమ్మవారికి పూజలు చేశారు. భక్తులు ఉదయం నుంచే దేవాలయంలో నవగ్రహ పూజల కోసం బారులుతీరారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

చిట్యాల, ఆగస్టు 24: మండలంలోని తిరుమలపురం గ్రామ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు హనుమకొండ సిరీ జ్యువెల్లర్స్ ఆధ్వర్యంలో శనివారం బ్యాగ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జ్యువెల్లర్స్ సిబ్బంది తోట శ్రీకాంత్, నిరంజన్, పూర్వవిద్యార్థులు గోల్కొండ మహేష్, గోపగాని శివ, గోల్కొండ జగదీష్, దాసారపు నరేష్, అంగన్వాడీ టీచర్ రమణమ్మ, తోట అనిత, జన్నె రమ తదితరులు పాల్గొన్నారు.

మెట్టుపల్లిలో వైద్యశిబిరం

మొగుళ్లపల్లి, ఆగస్టు 24 : మండలంలోని మెట్టుపల్లి గ్రామంలో వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగరాణి 52 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ముగ్గురు జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. అనంతరం వేములపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈశిబిరంలో పల్లె దవాఖాన డాక్టర్ సంధ్యారాణి, హెల్త్ సూపర్‌వైజర్ జమున, ఏఎన్ఎం స్వరూప, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో బీఆర్ఎస్ నేతల పర్యటన

మంగపేట, ఆగస్టు 24: మండలంలోని మల్లూరు, మల్లూరుమొట్లగూడెం, గాంధీనగర్, నర్సింహసాగార్, నరేంద్రావుపేట తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, మంగపేట సహకార సంఘం వైస్ చైర్మన్ కాడబోయిన నరేందర్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం పర్యటించి కార్యకర్తల బాగోగులను తెలుసుకున్నారు. కార్యకర్తలు అధైర్య పడొద్దని, బీఆర్ఎస్ పూర్తి అండగా ఉంటోందని భరోసా ఇచ్చారు. గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు కలిగినప్పుడు అండగా ఉండి న్యాయం జరిగేదాకా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గుండేటి రాజు, గుడివాడ శ్రీహరి, చల్లగురుగుల తిరుపతి, పిల్లలమర్రి వేణు, గౌని రమేష్, ముప్పారావు సందీప్, కిషోర్ పాల్గొన్నారు.

నాలుగు రోజుల్లో వివాహం..

▸▸ చెల్పూరులో యువతి ఆత్మహత్య



కోమల (ఫైల్)

గణపురం, ఆగస్టు 24: ఆ ఇంట్లో నాలుగు రోజుల్లో వివాహం జరగాల్సివుంది. ఇరు కుటుంబాలు పెళ్లి కార్డులు పంచుకున్నారు. ఇంతలోనే పెళ్లి కావాల్సిన యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండలంలోని చెల్పూరులో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. చెల్పూరుకు చెందిన బటికె సంపత్-సుగుణ దంపతులు వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి చిన్న కూతురు బటికె కోమల(25) డిగ్రీ పూర్తిచేసి ఇంటి వద్దే ఉంటుందన్నారు. రెండేళ్ల క్రితం కోమలకు పెళ్లి సంబంధం చూడగా ఇష్టం లేదని తెలపడంతో వివాహం చేయలేదన్నారు. ఈ క్రమంలో ఇటీవల మరో సంబంధం చూసి ఈనెల 28న వివాహం నిశ్చయించుకోవడం జరిగిందన్నారు. తల్లిదండ్రులు పెళ్లి పత్రికలు పంచడానికి వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో శుక్రవారం రాత్రి ఉరివేసుకుని చనిపోయిందని ఆ ఫిర్యాదులో తండ్రి పేర్కొన్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

భారీగా మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న కారు, మద్యం

వాజేడు, ఆగస్టు 24: కారులో అక్రమంగా తరలిస్తున్న మద్యంను పోలీసులు పట్టుకున్నారు. వాజేడు ఎస్సై రుద్రారపు హరీష్ తెలిపిన ప్రకారం... వాజేడు ఎస్సై-2 ఇమ్మాన్యుల్ ఆధ్వర్యంలోశనివారం మధ్యాహ్నం మండపాక వద్ద పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో ఏటూరునాగారం వైపు నుంచి టాటాజెస్ట్(టీఎస్ 03 ఈబీ 3600) కారులో వస్తున్న వ్యక్తులు పోలీసులను చూసి తప్పించుకునే ప్రయత్నం చేశారు. పారిపోతున్న కారును వెంబడించి పట్టుకొని తనిఖీ చేయగా భారీగా మద్యంను గుర్తించారు. ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లికి చెందిన ఎగ్గడి తేజ ఏటూరునాగారం నుంచి మండలంలోని మండపాక వైపుకు అక్రమంగా మద్యంను తరలిస్తున్నట్లు గుర్తించారు. కారులో రూ.82,674 విలువైన మద్యం ఉన్నట్లు తెలిపారు. కారును సీజ్ చేసి తేజపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుడిపై దాడి చేసిన కోతుల గుంపు

కృష్ణకాలనీ(భూపాలపల్లి), ఆగస్టు 24: భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని జంగేడు గ్రామానికి చెందిన ఓ వృద్ధుడిపై శనివారం కోతుల గుంపు దాడిచేసి తీవ్రంగా గాయపర్చాయి. కుటుంబ సభ్యులు, బాధితుడు తెలిపిన ప్రకారం... జంగేడుకు చెందిన దుబాసి లక్ష్మీరాజం సాయంకాలం స్నానమాచరించి ఇంట్లోకి వెళ్తున్నాడు. ఈక్రమంలో ఇంటిపై నుంచి ఒక్కసారిగా వచ్చిన కోతుల గుంపు ఆయనపై దాడి చేసింది. కుడి కాలుపై బలంగా కొరకడంతో తీవ్ర రక్తస్రావమైంది. ఆ వెంటనే కుటుంబీకులు ఆయన్ను ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. కాగా, కొంతకాలంగా భూపాలపల్లి మునిసిపాలిటీలోని వార్డుల్లో కోతుల బెడద తీవ్రతరం కావడంతో పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు. కోతులను పట్టి సుదూర ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు.

సాయిబాబా దేవాలయంలో చోరీ

▸▸ హుండీ అపహరణ.. గుర్తించిన పోలీసులు



దేవాలయంలో చోరీ వివరాలను సేకరిస్తున్న ఎస్సై తాజుద్దీన్

ఏటూరునాగారం, ఆగస్టు 24: మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయిబాబా దేవాలయంలో చోరీ జరిగింది. దేవాలయంలోని ప్రధాన గర్భగుడి తాళాలను పగలగొట్టి హుండీని గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం 6 గంటలకు ప్రధాన అర్చకులు ఎల్లాప్రగడ భానుప్రకాష్ శర్మ ఆలయానికి రాగా, ప్రధాన ద్వారం తాళాలు పగలగొట్టి ఉండడంతో నివ్వెరపోయారు. ఈ విషయాన్ని అర్చకులు దేవాలయ కమిటీ సభ్యులకు తెలుపగా, స్థానిక పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్సై ఎస్కే తాజుద్దీన్ దేవాలయానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. సిబ్బందితో చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలించగా జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో దొంగలు అపహరించుకుపోయిన హుండీని గుర్తించారు. అనంతరం దేవాలయ కమిటీ, స్థానికుల సమక్షంలో హుండీని దేవాలయానికి తరలించారు. హుండీలో సుమారు రూ.6వేలు ఉండగా దొంగలు అపహరించారని దేవాలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, సభ్యులు గంజి రమేష్, వెంకట్రావు, బచ్చు సతీష్, పర్వతాల కుమారస్వామి ఎస్సైకి వివరించారు. సీసీ కెమెరాల ఫుటేజీ ద్వారా దొంగలను గుర్తిస్తామని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.